
# అదానీకి ఎల్ఐసీ తలుపులు బార్లా

**రూ.5వేల కోట్లతో అదానీ పోర్ట్స్ ఎన్‌సీడీని పూర్తిగా సబ్‌స్క్రైబ్ చేసిన ఎల్ఐసీ • ప్రభుత్వ రంగ బీమా సంస్థ తీరుపై సర్వత్రా విమర్శలు**




ముంబై, జూన్ 3: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం, జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) నిర్ణయం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. గౌతమ్ అదానీకి చెందిన అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఏపీసెజ్) జారీ చేసిన రూ.5,000 కోట్ల విలువైన నాన్-కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ)ను ఎల్ఐసీ పూర్తిగా సబ్‌స్క్రైబ్ చేయడం ఇప్పుడు సర్వత్రా విమర్శలకు దారితీస్తున్నది. గతంలోనూ అదానీ గ్రూప్ సంస్థల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టడం.. హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంచలన రిపోర్టుతో స్టాక్ మార్కెట్లలో అదానీ కంపెనీల షేర్లు కుప్పకూలడం.. ఎల్ఐసీ పెట్టుబడుల విలువ సగానికిపైగా పడిపోవడంతో సర్కారీ బీమా సంస్థ వ్యవహార శైలిపై అంతా విరుచుకుపడ్డ విషయం తెలిసిందే. ఈ క్రమంలో మళ్లీ అదానీ పోర్ట్స్ ఎన్‌సీడీలను మొత్తానికి మొత్తం కొనడం మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది.

**మోదీ హయాంలో..**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, గుజరాత్‌కు చెందిన అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీకి మధ్య ఉన్న స్నేహం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం అదానీ గ్రూప్ సంస్థలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తుందన్న విమర్శలూ వచ్చిన సంగతి విదితమే. అదానీ గ్రూప్ సంస్థల్లోకి దేశ, విదేశాల నుంచి వచ్చిన పెట్టుబడులు, ఆయా దేశాలతో జరిగిన ఒప్పందాలూ చర్చనీయాంశమైయ్యాయి. ఈ నేపథ్యంలో దేశంలోనే అతిపెద్ద సంస్థాగత మదుపరిగా ఉన్న ఎల్ఐసీ.. అదానీ గ్రూప్ సంస్థల్లో పెట్టుబడులపట్ల అమితాసక్తిని కనబర్చడం వెనుక కూడా కేంద్ర ప్రభుత్వ పెద్దల ప్రమేయం ఉందన్న ఆరోపణలైతే వినిపిస్తున్నాయి. తాజాగా ఏపీసెజ్ ఎన్‌సీడీలను మొత్తంగా కొనేయడం ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నది.

**ఎఫ్ఐఐలు పోతున్నా..**

అదానీ సంస్థల్లో విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) క్రమేణా తమ వాటాలను తగ్గించుకుంటున్నారు. అదానీ గ్రీన్ ఎనర్జీలో ఎఫ్ఐఐ వాటాలు 3 నెలల్లో 13.68 శాతం నుంచి 12.45 శాతానికి దిగజారాయి. తగ్గిన పెట్టుబడుల విలువ రూ.1,850 కోట్లు. అలాగే ఏపీసెజ్‌లో 13.93 శాతం నుంచి 13.42 శాతానికి తగ్గితే.. అంబుజా సిమెంట్స్‌లో 0.54 శాతం, ఏసీసీలో 0.31 శాతం మేర తగ్గాయి. వీటన్నిటి విలువ మరో రూ.2,120 కోట్లు, అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లోనూ రూ.54 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. మొత్తంగా రూ.4,024 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించారు. అయితే ఎల్ఐసీ మాత్రం పెట్టుబడులను పెడుతూపోతున్నది. దేశీయ స్టాక్ మార్కెట్లలో నమోదైన 10 అదానీ కంపెనీల్లో అదానీ విల్మర్, ఎన్డీటీవీ, అదానీ పవర్ మినహా అన్నింట్లో ఎల్ఐసీ పెట్టుబడులున్నాయి మరి. వీటి విలువ రూ.50,000 కోట్లపైనేనని అంచనా.

## ప్రీమియంలు జనాలవి.. లాభాలు అదానీకి

అదానీ గ్రూప్‌లో ఎల్ఐసీ రూ.5,000 కోట్ల పెట్టుబడులు పెట్టిన తీరును కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుబట్టారు. దేశంలోని సామాన్య ప్రజల సొమ్మును.. ప్రైవేట్ రంగ సంస్థలకు అప్పనంగా దోచిపెడుతున్నారంటూ దుయ్యబట్టారు. 'పైసలు, పాలసీ, ప్రీమియం మీవి.. భద్రత, సౌకర్యం, లాభం అదానీవి' అంటూ ఎల్ఐసీ పాలసీదారులనుద్దేశించి మంగళవారం రాహుల్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

### అదానీ గ్రూప్ సంస్థల్లో ఎల్ఐసీ వాటాలు

| సంస్థ | వాటా |
|---|---|
| అదానీ ఎంటర్‌ప్రైజెస్ | 4.02% |
| అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ | 8.06% |
| అదానీ టోటల్ గ్యాస్ | 7.86% |
| అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ | 3.00% |
| అంబుజా సిమెంట్స్ | 6.12% |
| ఏసీసీ | 7.69% |
| అదానీ గ్రీన్ | 1.36% |

- *గమనిక: స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ ఆధారంగా ఈ వాటాల్లో హెచ్చుతగ్గులుంటాయి.*
- *ఇటీవలికాలంలో అందుబాటులో ఉన్న సమాచారం మేరకే ఈ వాటాలు.*

## ఎన్‌సీడీలు అంటే?

*నిధుల సమీకరణకు ఆయా కంపెనీలు జారీ చేసేవే ఈ నాన్ కన్వర్టబుల్ డిబెంచర్స్ (ఎన్‌సీడీ). ఇవి ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాలు. ఈ డిబెంచర్లకు ఈక్విటీ షేర్లలోకి మార్చుకొనే సౌకర్యం ఉండదు. నిర్ణీత కాలవ్యవధితో ఉంటాయి. ఈ మొత్తం కాలవ్యవధికి ఒకే రకమైన నిర్ధిష్ట వడ్డీరేటు ఉంటుంది. అదానీ పోర్ట్స్ ఇప్పుడు తెచ్చిన ఎన్‌సీడీ కాలపరిమితి 15 ఏండ్లు. దేశీయంగా ఇటీవలికాలంలో ఇంత దీర్ఘకాల కార్పొరేట్ బాండ్లను అదానీ గ్రూప్ జారీ చేయడం ఇదే తొలిసారి. దీనిపై వార్షిక వడ్డీరేటు 7.75 శాతం ఆఫర్ చేసింది. మూలధన వ్యయం, సాధారణ కార్పొరేట్ అవసరాలు, రుణ భారాన్ని తగ్గించుకోవడానికి ఈ నిధులను అదానీ గ్రూప్ వినియోగించుకోనున్నది. కాగా, ఈ ఏడాది మార్చి 31నాటికి ఏపీసెజ్ నికర రుణ భారం రూ.36,422 కోట్లుగా ఉన్నది.*




# ఈవీ వచ్చేసిందోచ్

న్యూఢిల్లీ, జూన్ 3: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్ సరికొత్త ఈవీ మాడల్‌ను మార్కెట్‌కు పరిచయం చేసింది. ఎస్‌యూవీ విభాగాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగంగా సంస్థ నూతన హారియర్ ఈవీను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఏడాది మొదట్లో నూఢిల్లీలో జరిగిన ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శించిన ఈ మాడల్ ఆరు నెలల తర్వాత ప్రవేశపెట్టింది. ఈ కారు ప్రారంభ ధర రూ.21.49 లక్షలు. 75 కిలోవాట్ల బ్యాటరీ, 65 కిలోవాట్ల బ్యాటరీతో తయారైన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 627 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కేవలం 6.3 సెకండ్లలోనే 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 200 కిలోమీటర్లకు పైగా వేగంతో దూసుకుపోనున్నది. పనోరమిక్ సన్‌రూఫ్, 14.5 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, డ్యూయల్-జోన్ క్లైమెట్ కంట్రోల్ సిస్టమ్, 360 డిగ్రీల కెమెరా, 12.25 ఇంచుల పూర్తి స్థాయిలో కలర్ టచ్‌స్క్రీన్, లెవల్ 2 అడాస్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నాయి. ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ బుకింగ్‌ను ఇప్పటికే ప్రారంభించింది. బ్యాటరీ ప్యాక్‌పై జీవితకాలం వ్యారెంటీ కల్పిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. ప్రస్తుతం నెలకు 25 వేల యూనిట్లు అమ్ముడవుతున్న ప్రీమియం ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో ఈ వాహనంతో మరింత పెరిగే అవకాశం ఉన్నదని టాటా మోటర్స్ ప్యాసింజర్ వాహన ఎండీ శైలేష్ చంద్ర తెలిపారు.

# గ్రామాల్లోనూ ఆన్‌లైన్ షాపింగ్

**తెలంగాణలో పెరిగిన లావాదేవీలు • తాజా సర్వేలో వెల్లడి**



హైదరాబాద్, జూన్ 3 (నమస్తేతెలంగాణ): దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంత ప్రజల్లోనూ ఆన్‌లైన్ షాపింగ్ పెరిగిపోతున్నది. ఇప్పటికే నగరాలు, పట్టణాల్లో అనేక ఈ-కామర్స్ సంస్థలు, దుకాణదారులు వివిధ రకాల వస్తూత్పత్తులను ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇస్తే ఇంటి ముందుకు చేర్చుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పుడీ ట్రెండ్ గ్రామాలకూ చేరింది. ఇక తెలంగాణ ప్రజలైతే పెద్ద ఎత్తునే ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఓ తాజా సర్వేలో తేలింది.

**ఇదీ సంగతి..**

కేంద్ర గణాంకాలు, కార్యాచరణ అమలు మంత్రిత్వ శాఖ ఈ ఏడాది జనవరి-మార్చికిగాను కాంప్రహెన్సివ్ మాడ్యులర్ సర్వే: టెలికాం, 2025 పేరుతో ఓ అధ్యయనం చేపట్టింది. ఇటీవలే విడుదలైన ఈ సర్వేలో అనేక ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. ఓవరాల్‌గా దేశంలోని కుటుంబాల్లో సగటున 24.5 శాతం ఆన్‌లైన్‌లోనే కొంటున్నట్లు స్పష్టమైంది. అయితే రాష్ట్రాలవారీగా చూస్తే.. అత్యధికంగా తెలంగాణలో ఆన్‌లైన్ షాపింగ్ చేసే కుటుంబాలు 35.1 శాతంగా ఉంటే, అత్యల్పంగా ఆంధ్రప్రదేశ్‌లో 23.4 శాతంగా ఉన్నాయి. నగరాలవారీగా చూస్తే మాత్రం.. చండీగఢ్, గోవా, దాద్రా-నగర్ హవేలి టాప్‌లో నిలిచాయి.

**పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో..**

తెలంగాణలోని నగర, పట్టణ ప్రాంతాల్లో ఆన్‌లైన్ కొనుగోలుదారులు 56.6 శాతంగా ఉన్నారు. గ్రామాల్లో 16 శాతంగా ఉన్నారు. బీహార్‌లో ఈ గణాంకాలు వరుసగా 40.1 శాతం, 24.8 శాతంగా ఉన్నాయి. అలాగే ఏపీలో 35 శాతం, 16.6 శాతంగా నమోదయ్యాయి. ఇదిలావుంటే దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న కొనుగోళ్లలో ఆహారేతర వస్తూత్పత్తులే ఎక్కువగా ఉంటున్నాయి. ఈ జనవరి-మార్చిలోనూ 53.3 శాతంగా నమోదయ్యాయి. ఆహార పదార్థాల కొనుగోళ్లు 7.6 శాతంగానే ఉన్నాయి.

## విద్యా రుణాలపై వడ్డీరేటు తగ్గించిన పీఎన్‌బీ

న్యూఢిల్లీ, జూన్ 3: పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ).. విద్యాలక్ష్మి స్కీం కింద విద్యా రుణాలు తీసుకునేవారికి వడ్డీరేటును 20 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్టు మంగళవారం ప్రకటించింది. విద్యా రుణాలు తీసుకునేవారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలనే ఉద్దేశంతో బ్యాంక్ ఈ ప్రత్యేక స్కీంను తీసుకొచ్చింది. దేశవ్యాప్తంగా 860కి పైగా ఉన్నత ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్‌లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు రుణాలు ఇవ్వనున్నట్లు బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. 7.5 శాతం వార్షిక వడ్డీతో విద్యా రుణాలు మంజూరు చేస్తున్నది.

# మూడోరోజూ నష్టాలు

*81 వేల పాయింట్ల దిగువకు సెన్సెక్స్*

ముంబై, జూన్ 3: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోరోజూ నష్టపోయాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను తరలించుకుపోవడం, ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం మార్కెట్లను నష్టాలవైపు నడిపించాయి. ఎనర్జీ, ఫైనాన్స్, ఐటీ రంగ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో ఒక దశలో ఒక్క శాతానికి పైగా నష్టపోయిన సూచీలు చివర్లో ఈ భారీ నష్టాలను తగ్గించుకోగలిగాయి. ఇంట్రాడేలో 800 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 636.24 పాయింట్లు కోల్పోయి 80,737.51 వద్ద నిలిచింది. మరో సూచీ నిఫ్టీ 174.10 పాయింట్లు కోల్పోయి 24,542.50 పాయింట్ల వద్ద ముగిసింది. షేర్లలో 2,266 సూచీలు నష్టపోగా..1,731 సూచీలు పెరుగుదల కనిపించింది. అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడైనప్పటికీ దేశీయ సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయని, భౌగోళిక రాజకీయ సమస్యలు మరింత ముదురుతుండటం, డాలర్ బలహీనపడటం కూడా సూచీల పతనానికి ఆజ్యంపోశాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.

**టాప్ లూజర్‌గా యెస్ బ్యాంక్**

యెస్ బ్యాంక్ షేరు కుప్పకూలింది. బ్యాంక్ షేరు 10.40 శాతం నష్టపోయింది. అంతర్జాతీయ పెట్టుబడి సంస్థ కార్లైల్ గ్రూపు..యెస్ బ్యాంక్‌లో తన వాటాను 2.6 శాతం విక్రయిస్తున్నట్టు ప్రకటించడంతో బ్యాంక్ షేరు భారీగా నష్టపోయింది.

## అదానీ షేర్లకు నష్టాలు

అదానీ గ్రూపు షేర్లు భారీగానష్టపోయాయి. అదానీ పోర్ట్ అత్యధికంగా 2.42 శాతం నష్టపోగా, ఎన్డీటీవీ 2.25 శాతం, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 2.18 శాతం, అదానీ పవర్ 2.02 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 1.89 శాతం మేర నష్టపోయాయి. దీంతోపాటు అదానీ టోటల్ గ్యాస్ 1.62 శాతం, అదానీ గ్రీన్ 1.58 శాతం, సంఘీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ 1.16 శాతం, అంబుజా సిమెంట్, ఏసీసీ, ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్ షేర్లు నష్టపోయాయి.

## ఎల్ఐసీ ఎండీగా రత్నాకర్ పట్నాయక్



ముంబై, జూన్ 3: ప్రభుత్వరంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ) నూతన మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులైన రత్నాకర్ పట్నాయక్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. 1990లో ఎల్ఐసీ డైరెక్ట్ రిక్రూట్ ఆఫీసర్‌గా తన కేరియర్‌ను ప్రారంభించిన పట్నాయక్..పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్ డిగ్రీ చేశారు. గతంలో ఎల్ఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అధికారిగా విధులు నిర్వహించారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.